ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 హైదరాబాద్ నగర వార్తలు

గురువారం 2 అక్టోబరు 2025



నగరంలో బుధవారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో వాహనదారులు ఫ్లైఓవర్ల కింద తలదాచుకున్నారు.
- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

సత్యమేవ జయతే

ఒకే రోజు రెండు పర్వదినాలు.. వాటి సారం ఒక్కటే



హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) :చెడుపై మంచి గెలిచిన రోజు(దసరా పండుగ).. అంతర్జాతీయ అహింసా దినం(మహాత్ముడి జయంతి).. రెండూ ఈ ఏడాది ఒకేరోజు రావడం కాకతాళీయమే. అయితే ఆ పర్వదినాల పరమార్థం ఒక్కటే. అదే 'సత్యమేవ జయతే'. ప్రశ్నించే తత్వాన్ని వారసత్వంగా మనకు అందించారు బాపూజీ. దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కోసం తొమ్మిది రూపాలు దాల్చింది దుర్గమ్మ. న్యాయాన్ని ధర్మబద్ధంగా సాధించేందుకు సత్యాగ్రహ మార్గాన్ని గాంధీజీ చూపించారు. అమ్మలా ప్రేమ పంచడమేకాదు అవసరమైతే అపరకాళిగానూ మారాలన్నది ఆదిశక్తి అవతారాల సందేశం.

దుర్గమ్మ సందేశం - మహాత్ముడి బోధన

లోక కంటకులైన అసురులను మట్టుపెట్టేందుకు అమ్మ తొమ్మిది రూపాలు దాల్చింది. రాక్షసులంటే కొమ్ములు, కోరలతో వికారమైన రూపంలో దర్శనమిస్తారనుకుంటే పొరపాటే. మనిషి లోని పశుప్రవృత్తి, అహంకారం, అసూయ, ఈర్ష్య, ద్వేషం, మూర్ఖత్వం, కుసంస్కారం వంటి అవలక్షణాలే రాక్షసత్వానికి ప్రతిరూపం. రాక్షసత్వానికి పాల్పడితే శిక్షతప్పదని ఆదిశక్తి అవతారాలు హెచ్చరిస్తాయి. కామ, క్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యాలైన అంతర్గత శత్రువులపై ఆధిపత్యం సాధించడానికి సత్యనిష్ఠ ఒక్కటే ఏకైక మార్గమని మహాత్ముడు బోధించాడు.

ఎదురెదురుగా రెండు బైకులు ఢీ.. ముగ్గురు యువకులు దుర్మరణం

- అతివేగమే ప్రమాదానికి కారణం




ఇస్లావత్ మోహన్, కేతావత్ సిద్ధూ,(ఫైల్) | తుక్కుగా మారిన ద్విచక్ర వాహనాలు

పహాడిషరీఫ్ అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరో యువకుడు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పహాడిషరీఫ్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్షగూడకు చెందిన ఇస్లావత్ మోహన్ (20), కేతావత్ సిద్ధూ, (17), సింహాద్రి ముగ్గురూ బైక్‌పై తుక్కుగూడ సర్వీస్ రోడ్ గుండా హర్షగూడ వైపునకు వెళ్తున్నారు. ఇదే సమయంలో షాద్‌నగర్ బాలానగర్‌కు చెందిన కొండా అరుణ్ (24) మరో బైక్‌పై అదే సర్వీస్ రోడ్‌లో ఎదురుగా వచ్చాడు. రెండు బైకులు ఒకదానికొకటి ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మోహన్, సిద్ధూ, అరుణ్ అక్కడికక్కడే చనిపోయారు. సింహాద్రికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పహాడిషరీఫ్ పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన యువకుడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదంలో బైకులు ధ్వంసమయ్యాయి.

'ఫ్లైఓవర్ పేరులో మార్పు లేదు'

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ పేరులో మార్పు లేదని జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ వింగ్ తెలిపింది. తెలంగాణ తల్లి బోర్డుపై మంగళవారం స్టిక్కర్ అంటించి ఉండడంతో మళ్లీ పేరు మారిందని ప్రచారం జరిగిన నేపథ్యంలో క్లారిటీ ఇచ్చింది. తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా నామకరణం చేయడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదించిందని, ఈమేరకు త్వరలోనే కొత్త బోర్డులు ఏర్పాటు చేస్తామని జీహెచ్ఎంసీ పేర్కొంది.

14 కేసుల్లో 22 మంది అరెస్టు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు పాల్పడిన 22 మందిని అరెస్టు చేసినట్లు సైబరాబాద్ సైబర్ క్రైం ఇన్‌చార్జి డీసీపీ సృజన కరణం తెలిపారు. సెప్టెంబరు 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో 14 కేసుల్లో 22 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. 22 మందిలో 17 మంది ట్రేడింగ్ పేరుతోనే మోసాలకు పాల్పడినట్లు వివరించారు. ఒక కేసులో రూ.1.16 కోట్ల ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాన్ని ఛేదించి, మహారాష్ట్రలో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో బాధితురాలు నకిలీ స్టాక్ ట్రేడింగ్ అప్లికేషన్ ద్వారా మోసపోయిందని వెల్లడించారు.

దసరా వ్యాపారం 4000 కోట్లు!



నగరంలో జరిగిన కొనుగోళ్లపై ఓ అంచనా

- ఒక్క వస్త్ర వ్యాపారంలోనే రూ.1500 కోట్లు
- ఆటోమొబైల్ రంగంలో రూ.1000 కోట్లు
- ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయెన్సస్‌లోనూ సందడి
- వన్నె కోల్పోయిన ఆభరణం
- చిరువ్యాపారుల్లో కనిపించని సంతోషం



కూకట్‌పల్లిలోని ఓ షోరూంలో కొనుగోలుదారుల సందడి

హైదరాబాద్ సిటీ నెట్‌వర్క్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ పండుగతో ప్రారంభమైన షాపింగ్ సందడి, దసరా పండుగ ముందు రోజు వరకూ కొనసాగుతూనే ఉంది. పండుగ వేళ నూతన వస్త్రాలను కొనడం సాధారణమే అయినప్పటికీ, ఈసారి జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ఆటోమొబైల్ రంగంలోనూ జోష్ కనిపించింది. అలాగే, ఎలక్ట్రానిక్స్ హోమ్ అప్లయెన్సస్ అమ్మకాల్లో జోరు కనిపించినప్పటికీ ఆన్‌లైన్‌తో పోలిస్తే, ఆఫ్‌లైన్‌లో ధరలు కాస్త ఎక్కువగానే ఉండటం, బ్యాంక్ ఆఫర్లు కలిసి రావడంతో సూపర్‌మార్కెట్లలో అమ్మకాల జోరు పెద్దగా కనిపించలేదని వ్యాపారులు చెబుతున్నారు. బంగారం అయితే వన్నె కోల్పోయింది. మొత్తంగా దసరా, బతుకమ్మ సీజన్‌లో నగరంలో సుమారు 4వేల కోట్ల రూపాయల వ్యాపారం జరిగి ఉంటుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

10వేల కార్లు, 30 వేల బైక్‌లు..

గత సీజన్‌తో పోలిస్తే ఈ దసరాకు అమ్మకాలు భారీగానే జరిగాయని ఎక్కువ మంది చెబుతున్నారు. పండుగకు ముందు ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగం లాభపడిందని అంటున్నారు. పండుగకు ముందు సరిగ్గా నాలుగు రోజుల్లో నగరంలో 5వేలకు పైగా కార్లు అమ్ముడుపోయినట్లు ఆటోమొబైల్ రంగ నిపుణులు మంచికంటి సంతోష్ తెలిపారు. ఈ అమ్మకాలలో 50% మారుతీవే అన్నారు. పలు సంస్థలు, డీలర్లు ప్రకటించిన ఆఫర్లతో భారీగా లబ్ధి కలుగుతుండటంతో ఎక్కువ మంది కార్ల కొనుగోలుకు మొగ్గు చూపారంటున్నారు. మొత్తంమీద ఈ 10 రోజుల పండుగ కాలంలో నగరంలో 10వేలకు పైగా కార్లు, 30 వేలకు పైగా బైక్‌లు అమ్ముడయ్యాయని ఈ రంగాల్లోని ప్రముఖులు వెల్లడిస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే తమ అమ్మకాలు 40%కు పైగానే పెరిగాయని ఎంజీ రోడ్‌లోని హోండా షో రూమ్ ఇన్‌చార్జ్ సైమన్ తెలిపారు. దసరా పండుగ పది రోజుల్లోనే దాదాపు 1000 కోట్ల రూపాయలు అమ్మకాలు నగరంలో జరిగి ఉంటాయని అంచనాగా పేర్కొంటున్నారు.

ఆటో మొబైల్ విక్రయాలు బాగున్నాయి



ఈ దసరా నగరంలోని ఆటో డీలర్లకు అసలైన సంతోషం తీసుకువచ్చింది. జీఎస్టీ తగ్గడంతో కార్లను గతంలో ఎన్నడూ లేనంతగా కొన్నారు. నాలుగు రోజుల్లోనే 5 వేల కార్లను కొన్నారు.

- మంచికంటి సంతోష్, ఆటోమొబైల్ నిపుణుడు

అమ్మకాలు లేవు



గత సంవత్సరం బంగారం విక్రయాలు బాగానే జరిగాయి. ఇప్పుడు ఎవరూ రావడం లేదు. బంగారం ధర పెరగడమే దీనికి కారణం.

- చేలారం చౌదరి, హేమ జ్యువెలర్స్, రాజేంద్ర నగర్

మాల్స్‌లో సందడి

ఆటోమొబైల్ రంగం తర్వాత మాల్స్‌లో సందడి కనిపించింది. మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి లాంటి చోట్ల ఉన్న మాల్స్‌లో రద్దీ అధికంగా ఉంది. పలు ఎలక్ట్రానిక్ షోరూమ్‌లలో కూడా ఈ సందడి కనిపించిందని పంజాగుట్టలోని ఓ ఎలక్ట్రానిక్స్ షోరూమ్ ప్రతినిధి ముజీబ్ తెలిపారు. ఆఫర్లకు తోడు జీఎస్టీ తగ్గింపు ధరలు, ఆన్‌లైన్‌లో పోటీగా ధరలు అందించడం వల్ల గతంతో పోలిస్తే ఎక్కువ మంది కొనుగోళ్లు చేశారని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎలక్ట్రానిక్స్ హోమ్ అప్లయెన్సస్ రంగంలో 25-30% వరకూ వృద్ధి చూశామని వెల్లడించారు.

చిన్నబోయిన చిరు వ్యాపారం

దసరా సీజన్‌లో ఒక్క వస్త్ర వ్యాపారం పైనే నగరంలో 1500 కోట్ల రూపాయల అమ్మకాలు

మిగతా 6వ పేజీలో..

మార్కెట్లోకి నకిలీ మెహందీ

- నిర్వాహకుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కరాచీ పేరుతో నకిలీ మెహందీ విక్రయిస్తున్న వ్యక్తిని సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వట్టేపల్లికి చెందిన మహ్మద్ అబ్దుల్ వసీం (54) మెహందీ ప్రొడక్ట్ తయారీ లైసెన్స్ తీసుకొని గౌస్‌నగర్‌లో మశ్రత్ మెహందీ పేరుతో కోన్‌లు తయారు చేసి విక్రయిస్తున్నాడు. అతడు తయారు చేసిన మెహందీ అమ్ముడు కాకపోవడంతో మార్కెట్లో డిమాండ్ ఉన్న కరాచీ మెహందీ పేరుతో మార్కెట్‌లోకి సరఫరా చేస్తున్నాడు. పోలీసులు అతడి కార్ఖానాపై దాడి చేశారు. రూ.5లక్షల విలువైన ముడిసరుకు, కోన్లు స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న సామగ్రితో నిందితుడు



బతుకమ్మకుంట బాధ్యత హైడ్రాదే

● హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వీహెచ్ వినతి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట బతుకమ్మ కుంటను బాగా అభివృద్ధి చేసి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. దాని నిర్వహణ బాధ్యతను కూడా హైడ్రానే తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. బుధవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కబ్జాచెర నుంచి బతుకమ్మ కుంటను కాపాడడం, చెరువుగా అభివృద్ధి చేయడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడం ఇలా అన్ని కార్యక్రమాలు ఎంతో వైభవంగా జరిగాయని, ఈ విషయంలో హైడ్రా చేసిన కృషి అభినందనీయమని వీహెచ్ అన్నారు. బతుకమ్మకుంటను అభివృద్ధి చేసి వదిలేశారు అనే అపవాదు రాకుండా దీని పరిరక్షణ బాధ్యతను హైడ్రా తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వి.హనుమంతరావు

బోటు షికారు కొనసాగించండి

బతుకమ్మకుంటలో ఉన్న బోటు షికారును కొనసాగించాలని హైడ్రా కమిషనర్‌కు వీహెచ్ విజ్ఞప్తి చేశారు. హైడ్రా కమిషనర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నారాయణస్వామి ఉన్నారు.

దుర్గామాత ప్రతిమల నిమజ్జనం.. నేడు, రేపు ట్రాఫిక్ మళ్లింపు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దుర్గామాత ప్రతిమల నిమజ్జనం దృష్ట్యా నగరంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టామని హైదరాబాద్ సిటీ పోలీస్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న పీపుల్స్ ప్లాజా, గార్డెన్ పాయింట్, జలవిహార్ వద్ద ఉన్న బేబీ పాండ్, సంజీవయ్య పార్కు ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు చేశామన్నారు. గురు, శుక్రవారాల్లో నిమజ్జనం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ మళ్లింపు నిబంధనలు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ జాయింట్ సీపీ తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

- పంజాగుట్ట, రాజ్‌భవన్ నుంచి కాకుండా వీవీ విగ్రహం నుంచి నిరంకారి జంక్షన్ వైపుగా..
- నిరంకారి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను ఓల్డ్ సైఫాబాద్ పోలీస్ స్టేషన్, రవీంద్రభారతి, మాసబ్‌ట్యాంక్ వైపునకు..
- ఖైరతాబాద్ బడా గణేశ్ లేన్ నుంచి వచ్చే వాహనాలు ప్రింటింగ్ ప్రెస్ జంక్షన్ నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం వైపు తరలింపు..
- అప్పర్ ట్యాంక్‌బండ్ నుంచి వచ్చే వాహనాలు ఓల్డ్ అంబేడ్కర్ విగ్రహం, లిబర్టీ వెళ్లేలా చర్యలు.
- హిమాయత్‌నగర్ వై జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను లిబర్టీ జంక్షన్ వద్ద మళ్లింపు. అలాగే ఓల్డ్ అంబేడ్కర్ విగ్రహం, తెలుగు తల్లి ఫ్లై ఓవర్, ఎన్‌టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు వైపుగా..
- రాణీగంజ్ నుంచి వచ్చే వాహనాలను నల్లగుట్ట ఎక్స్ రోడ్డు వద్ద మళ్లింపు.
- మినిస్టర్ రోడ్డు మీదుగా నెక్లెస్ రోడ్డు వైపు వచ్చే వాహనాలను నల్లగుట్ట ఎక్స్‌రోడ్డు వద్ద మళ్లించి రాణీగంజ్ మీదుగా..

చుక్కా రామయ్యకు పద్మ విభూషణ్ ఇవ్వాలి

● జూలూరు గౌరీశంకర్

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు చుక్కా రామయ్యకు కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ ఇచ్చి సత్కరించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ కోరారు. వేలాదిమంది ఐఐటీలను తయారుచేసి దేశానికి, ప్రపంచానికి అందించిన చుక్కారామయ్య రెండు తెలుగు రాష్ట్రాలు గర్వించదగ్గ వ్యక్తి అని పేర్కొన్నారు. గాంధీ 156వ జయంతి సందర్భంగా గాంధేయవాది, రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన "గ్లోబల్ రోల్ మోడల్ మహాత్మా గాంధీ" పుస్తకాన్ని చుక్కా రామయ్య బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. జూలూరు మాట్లాడుతూ అమెరికాలోని సిలికాన్ వాలీ తెలుగు విద్యార్థులతో నిండిపోవడానికి కారకుడు రామయ్యే అన్నారు. పుస్తక రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ గాంధీ వ్యక్తిత్వం, ఆయన ఆలోచనలు, ఆచరణ, తాత్వికత నేటి కాలానికి ఎంత అవసరమో గ్లోబల్ రోల్ మోడల్ గాంధీ పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లికేషన్స్ వ్యవస్థాపకుడు కోయ చంద్రమోహన్, రామానంద తీర్థ గ్రామీణ విద్యా సంస్థ చైర్మన్ నారా కిషోర్ రెడ్డి, రామయ్య తనయుడు సైంటిస్ట్ చుక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



"గ్లోబల్ రోల్ మోడల్ మహాత్మా గాంధీ" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చుక్కా రామయ్య, జూలూరు గౌరీశంకర్ తదితరులు

సాస్ ఇన్‌ఫ్రా తరగతి గదుల నిర్మాణం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫ్రీడమ్ త్రూ ఎడ్యుకేషన్ అంటూ దేశవ్యాప్తంగా మూడు వేలకు పైగా పాఠశాలల్లో ఏడు వేలకు పైగా తరగతి గదులను నిర్మించిన రౌండ్ టేబుల్ ఇండియాతో సాస్ ఇన్‌ఫ్రా చేతులు కలిపింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా వెనుకబడిన వర్గాల పిల్లల భవిష్యత్‌కు భరోసా అందించాలన్నది తమ ప్రయత్నమని సాస్ ఇండియా సంస్థ ప్రతినిధి వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాలు, అవకాశాల మధ్య ఉన్న అంతరాన్ని ఫ్రీడమ్ త్రూ ఎడ్యుకేషన్ కార్యక్రమం పూరించనుందన్నారు.

నేటినుంచి ఆర్టీ ఇంజనీరింగ్ సైనిక్ స్కూల్

పూర్వ విద్యార్థుల గోల్ఫ్ టోర్నమెంట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీ ఇంజనీరింగ్ సైనిక్ స్కూల్ అలుమ్ని గోల్ఫ్ టోర్నమెంట్‌ను ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని స్టాల్వర్ట్‌గోల్ఫ్ డైరెక్టర్ రిటైర్డ్ బ్రిగేడియర్ డీవీ సింగ్ తెలిపారు. టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా సైనిక స్కూళ్ల పూర్వ విద్యార్థులు పాల్గొంటారన్నారు. బౌల్డర్‌హిల్ గోల్ఫ్ అండ్ కంట్రీక్లబ్‌లో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

రీఫర్ కంటెయినర్ స్పెషల్

● ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే రీఫర్ కంటెయినర్ స్పెషల్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. రైల్వే గతి శక్తి కార్గో టెర్మినల్, మెస్సర్స్ డీపీ వరల్డ్ మల్టీమోడల్ లాజిస్టిక్స్ తిమ్మాపూర్ నుంచి ముంబై జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్‌కు రీఫర్ కంటెయినర్‌ను రవాణా చేసింది. ప్రతీ బుధవారం తిమ్మాపూర్ నుంచి రీఫర్ కంటెయినర్‌ను రవాణా చేయడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్యరైల్వే అధికారులు తెలియజేశారు. రీఫర్ కంటెయినర్ స్పెషల్ ఆపరేషన్‌తో హైదరాబాద్‌లోని ఔషధ పరిశ్రమకు గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.

హైదరాబాద్ కెప్టెన్‌గా మమత



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): బీసీసీఐ సీనియర్ మహిళల టీ20 టోర్నమెంట్‌లో పాల్గొనే హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వికెట్‌కీపర్ మమత నియమితురాలైంది. బుధవారం హెచ్‌సీఏ సెలెక్టర్లు హైదరాబాద్ జట్టును ప్రకటించారు. ఈనెల 8వ తేదీ నుంచి గ్వాలియర్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. మడివాల మమతతో పాటు త్రిషా రెడ్డి, కావ్య, యషరి, క్రాంతి, ధ్రుతి, పూజ, నిధి, సాక్షి రావు, సృజన, నితీషా, శ్రీవల్లి, వైష్ణవి, ప్రతీక్ష, ప్రాంజల్‌కు జట్టులో చోటు లభించింది. స్టాండ్ బైలుగా తేజశ్విని, త్రిషా పూజిత, పార్వతి, జాస్మిన్ గిల్, చందన ఎంపికయ్యారు.

దసరా వ్యాపారం రూ. 4 వేల కోట్లు!

(5వ పేజీ తరువాయి)

ఉండొచ్చని ఓ బ్రాండెడ్ వస్త్ర కంపెనీ మేనేజర్ దర్యానీ అంచనా వేశారు. అయితే కొనుగోళ్లు అంతగా లేవని చిన్న వ్యాపారులు పేర్కొంటున్నారు. మాల్స్, పెద్ద షోరూమ్‌లలో భారీగా ఆఫర్లను ప్రకటించడంతో ఎక్కువ మంది అటువైపే చూశారు కానీ చిరు వ్యాపారులను పట్టించుకోలేదంటున్నారు. తమ వద్ద దాదాపు 70-80% అమ్మకాలు పడిపోయాయని స్వప్నలోక్ వద్ద షాప్ అండ్ గో నిర్వాహకుడు శ్రీకాంత్ వాపోయారు. బంగారం వ్యాపారమైతే భారీగా పడిపోయిందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే 50%కు పైగా అమ్మకాలు పడిపోయాయని ఓ జ్యువెలర్ షాప్ నిర్వాహకుడు ఆకుల ప్రతాప్ తెలిపారు. నిత్యావసరాల పరంగా హైపర్, డిస్కౌంట్ స్టోర్లలో కనిపించిన సందడి తమ వద్ద కనిపించలేదని కిరాణా వ్యాపారులు చెబుతున్నారు.

కెడెట్స్‌కు కమోడోర్ అభినందనలు

అల్వాల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కెడెట్స్‌ను ఎన్‌సీసీ డైరెక్టరేట్ సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయంలో కమోడోర్ నర్సింగ్ సైలాని బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. బెంగళూరు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ జలహళ్లిలో సెప్టెంబరు 18 నుంచి 29 వరకు నిర్వహించిన ఆలిండియా వాయు సైనిక్ క్యాంప్(ఏఐవీఎస్‌సీ)-2025లో ఎన్‌సీసీ డైరెక్టరేట్ (ఏపీ-తెలంగాణ)కు చెందిన ఎన్‌సీసీ కెడెట్స్ బృందం ప్రాతినిధ్యం వహించింది. ఈ బృందం వివిధ విభాగాల్లో ప్రతిభను ప్రదర్శించింది. విశాఖపట్నం 6(ఏ) ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ నుంచి సీపీఎల్. కె. ఉదయ ఆరోగ్యం పరిశుభ్రత పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించారు.

జూబ్లీహిల్స్‌లో దసరా దమ్కీ

● మద్యం.. లేకుంటే మామూళ్లు ఇవ్వాల్సిందే

● ఆశావహుల ఇళ్లకు చోటా, మోటా నేతల క్యూ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న నేతలకు దసరా పండగ ఖర్చు భారీగానే అవుతోంది. మద్యం, మామూళ్లు ఇవ్వాలంటూ చోట, మోటా నేతలు ఆశావహుల ఇళ్ల వద్ద క్యూ కట్టారు. కొందరూ ఆశావహులు రెండు రోజులుగా పంపకాలను ప్రారంభించారు. మద్యం, మామూళ్లు ఇచ్చి పంపుతున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ఓ నేత.. పండుగ రోజే ఇంటికి రావాలని.. మాంసం, మందుతో విందు ఉంటుందని ఫోన్ చేసి చెబుతున్నట్లు సమాచారం. దసరా మామూళ్లు ఇవ్వాలంటూ కాలనీలు, బస్తీలకు చెందిన నేతలు బారులు తీరారు. కొందరైతే ఏకంగా ఫోన్లు చేసి మరీ మన వెంట తిరిగేవారికి మందు పంచుదామని టికెట్ ఆశిస్తున్న ఆశావహుడి ముందు ప్రతిపాదన పెట్టినట్లు సమాచారం. కొందరూ యూట్యూబర్స్ కూడా టికెట్ ఆశించే వారి ఇళ్ల ముందు బారులు తీరుతున్నారు. వారం రోజులుగా తన ఇంటికి వచ్చే యూట్యూబర్స్ పేర్లను తన అనుచరుడి వద్ద నమోదు చేసుకోవాలని ఓ ఆశావహుడు సూచించగా.. 200కు పైగా పేర్లు నమోదైనట్లు తెలిసింది. కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్, గుర్రం మురళీగౌడ్, సీఎన్‌రెడ్డి, కంజర్ల విజయలక్ష్మీ ఫ్లెక్సీలు, బ్యానర్లు పెద్ద ఎత్తున కడుతున్నారు. కొందరు ఆశావహులు వివిధ ప్రాంతాల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించి మహిళలకు బహుమతులు అందజేశారు. జూబ్లీహిల్స్ టికెట్ ఆశిస్తున్న ఓ నేత ఖర్చు ఇప్పటికే కోటి రూపాయలకు పైగా చేరినట్లు తెలిసింది. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న వారు ఇప్పటి వరకు ఆరుగురు కాగా.. తాజాగా మైనంపల్లి టీమ్ పేరుతో ఫ్లెక్సీలు రావడంతో ఏడుగురికి చేరింది.

ఉదాసీన్ మఠం భూముల రక్షణకు

ఈవో నియామకం సబబే : హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి గ్రామ పరిధిలోని వై జంక్షన్ వద్ద 1010 నుంచి 1070 వరకు వివిధ సర్వే నంబర్లలో 540 ఎకరాల భూములు ఉన్న ఉదాసీన్ మఠానికి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)ను నియమిస్తూ ఎండోమెంట్స్ కమిషనర్ (రాష్ట్ర ప్రభుత్వం) జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు సమర్థించింది. ఈవో నియామకం చెల్లదని పేర్కొంటూ ఉదాసీన్ మఠం మహంత్ అరుణ్‌దాస్ ఉదాసీన్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మఠానికి చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా, నిర్వహణ లోపాలు లేకుండా చూసుకునేందుకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉండాల్సిందేనని హైకోర్టు పేర్కొంది. ఏపీ ఛారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ యాక్ట్ - 1987 ప్రకారం మఠానికి ఈవోను నియమిస్తూ 2009లో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఉదాసీన్ మఠం మహంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. ఉదాసీన్ మఠానికి ఈవోను నియమించాలనే ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థిస్తూ తీర్పు వెలువరించింది.

నిమ్స్‌లో ఆధునిక ఫిజియోథెరపీ పరికరాలు

నిమ్స్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌లో రూ. 40 లక్షలతో ఫిజియోథెరపీ విభాగంలో మూడు మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చామని, దీంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. బుధవారం వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్, అదనపు మెడికల్ సూపరింటెండెంట్లు లక్ష్మీ భాస్కర్, కృష్ణారెడ్డి, అసోసియేట్ డీన్ భూషణ్ రాజు, ఫిజియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ శ్రవణ్, పీఆర్వో సత్యగౌడ్, డాక్టర్ నవీన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో యాదవ అభ్యర్థిని గెలిపిస్తే

ఏడాదిపాటు కేబుల్ ప్రసారాలు ఉచితం

● కేబుల్ టీవీ నెట్‌వర్క్ ప్రొప్రైటర్ ఎన్. మల్లేష్ యాదవ్

బోరబండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో యాదవ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని గెలిపిస్తే ఏడాది పాటు కేబుల్ ప్రసారాలు ఉచితంగా అందిస్తానని కేబుల్ టీవీ నెట్‌వర్క్ ప్రొప్రైటర్ ఎన్. మల్లేష్ యాదవ్ ప్రకటించాడు. ఈ మేరకు కార్మికనగర్ కూడలిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. యాదవ సామాజిక వర్గం నుంచి మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్, నవయువ నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపకుడు వి.నవీన్ యాదవ్, మాజీమంత్రి కోడలు కంజర్ల విజయలక్ష్మి యాదవ్ జూబ్లీహిల్స్ టికెట్ ఆశిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరిగి ఫలితాలు వచ్చిన తర్వాతే ఈ ఆఫర్ మొదలవుతుందని చెప్పాడు.

జూ పార్కుకు మూడు జీబ్రాలు

● గుజరాత్‌లోని వంతారా నుంచి తీసుకొచ్చిన అధికారులు

మదీన, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్‌నెహ్రూ జంతు ప్రదర్శనశాల(జూపార్కు)లో జీబ్రాలు సందర్శకులను కనువిందు చేయనున్నాయి. గుజరాత్‌లోని వంతారా జూ నుంచి మూడు జీబ్రాలను అధికారులు తీసుకువచ్చారు. అందులో రెండు ఆడ, ఒక మగ జీబ్రాలు ఉన్నాయి. 35 ఏళ్లుగా జూ పార్కులో జీబ్రాలు లేవు. జంతు మార్పిడిలో భాగంగా వంతారా జూపార్కుకు 20 మూషిక జింకలను ఇచ్చి అక్కడి జూపార్కు నుంచి జీబ్రాలను తీసుకువచ్చారు. ఈనెల 6వ తేదీన జరగనున్న 'జూ డే' సందర్భంగా జీబ్రాలను సందర్శకులు తిలకించడానికి ఎన్‌క్లోజర్‌లోకి విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



డీసీఎం నుంచి వస్తున్న పొగ

షార్ట్ సర్క్యూట్.. డీసీఎంలో మంటలు

● కాలిపోయిన మద్యం బాటిళ్లు

రామంతాపూర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): షార్టుసర్క్యూట్‌తో డీసీఎం వ్యాన్‌లో మంటలు చెలరేగాయి. సకాలంలో మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. మద్యం బాటిళ్ల లోడ్‌తో డీసీఎం రామంతాపూర్‌లోని వైన్ మార్ట్‌కు బయలుదేరింది. స్ఫూర్తి కళాశాల వద్దకు వెళ్లగానే డీసీఎం అకస్మాత్తుగా ఆగిపోయింది. స్థానికులు వాహనాన్ని పక్కకు తొలగిస్తుండగా వ్యాన్‌లోని స్టాక్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. డీసీఎంలోని మద్యం బాటిళ్లు పాక్షికంగా కాలిపోయాయి. వాహనంలోని మద్యం బాటిళ్లను స్థానికులు తీసుకెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు.



హైదరాబాద్ జట్టు జెర్సీని ఆవిష్కరిస్తున్న అభిషేక్

పోచంపల్లి మోడల్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జెర్సీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ సీజన్-4లో బరిలోకి దిగుతున్న హైదరాబాద్ బ్లాక్ హాక్స్ (హెచ్‌బీహెచ్) జట్టు తన కొత్త జెర్సీని ఆవిష్కరించింది. బుధవారం హెచ్‌బీహెచ్ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి, ఆ టీమ్ కెప్టెన్ పాలో లూరీ లామోనియర్ జెర్సీని ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతికి ప్రాధాన్యత ఇస్తూ పోచంపల్లితో చేనేత వస్త్ర కళాకారులు తయారు చేసే ఇక్కత్ ఫ్యాబ్రిక్ ప్రేరణతో హైదరాబాద్ జట్టు జెర్సీని తయారు చేయడం విశేషం. హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వాలీబాల్ అభిమానులు మద్దతు ఇచ్చి ప్రోత్సహించాలని అభిషేక్ రెడ్డి కోరారు.



కేవలం 9, 10 తరగతులకే ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు

● మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో పేదరికం కారణంగా అర్ధంతరంగా చదువును ఆపివేసే మైనారిటీ వర్గాల విద్యార్థులను చదవుపట్ల ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను మోదీ ప్రభుత్వం కేవలం 9,10 తరగతులకే పరిమితం చేసిందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఫలితంగా కేంద్రం మైనారిటీ సంక్షేమం కోసం కేటాయించిన నిధుల్లో 2023 నాటికి రూ.4,500కోట్లు విడుదల కాలేదని విమర్శించారు. 2023-24లో సుమారు రూ.600 కోట్లు కేటాయించగా కేవలం రూ.198.23కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను ఆ వర్గం అభివృద్ధి కోసం ఖర్చు చేయడం లేదని దీంతో మైనారిటీ సంక్షేమ పథకాలు అమలుకు నోచుకోవడం లేదని ఒవైసీ ఎక్స్ వేదికగా ఆరోపించారు.

ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

రాజేంద్రనగర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని వేడుకున్నామన్నారు. ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవపల్లి డివిజన్‌ల కార్పొరేటర్లు పి.అర్చన జయప్రకాశ్, మోహంద్ర సంగీత గౌరీశంకర్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు టి.ప్రేందాస్‌గౌడ్, కోరని శ్రీలత మహేత్మా, నాయకులు వై.శ్రీధర్, సందీప్, కొమురయ్య, రామేశ్వర్‌రావు, రాఘవేందర్, తదితరులు ఉన్నారు.













బీసీలకు ప్రాధాన్యం

● మాజీ ఎంపీ వి.హనుమంతరావు

హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో బీసీలకు మంత ప్రాధాన్యం లభిస్తుందని స్థానిక ఎన్నికల్లోనే కాకుండా విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు అన్నారు. ఎన్నికలకు ముందుగానే 4500కిమీ పాదయాత్ర చేసి రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా ఉన్న బడుగు బలహీన వర్గాల సమస్యలు స్వయంగా తెలసుకున్నారని చెప్పారు. బుధవారం హన్మంతరావు గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల, జనగణన చేసి బీసీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కామారెడ్డి బహిరంగ సభలో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారన్నారు. బీసీలకు అవకాశాలు దక్కకుండా కొంత మంది నేతలు పిటీషన్లు వేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అయినప్పటికీ మంత్రి పొన్నం, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ బీసీలకు ప్రత్యేక కార్యాచరణ తీసుకున్నారన్నారు. అసెంబ్లీలో బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు తెలిపి.. బయట ధర్నాలు చేస్తున్నాయని విమర్శించారు. 42 శాతం కోసం బీసీలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో బీసీలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని, దీన్ని బీసీలు సొంతం చేసుకోవాలని సూచించారు.

చైనా మాంజా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


● రూ. 7.20 లక్షల మాంజా స్వాధీనం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అతడి నుంచి రూ.7.20 లక్షల విలువైన చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. మంగళ్‌హాట్‌కు చెందిన సుమిత్ సింగ్(31), రాజేష్‌సింగ్ (52) మంగళ్‌హాట్ ప్రాంతంలో పతంగులు, మాంజా దుకాణం నిర్వహిస్తున్నారు. వీరు నిషేధిత చైనా మాంజాను సేకరించి, విక్రయిస్తున్నారు. వీరి దందాపై సమాచారమందుకున్న ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ మంగళ్‌హాట్ పోలీసులు కలిసి దుకాణంపై దాడి చేశారు. వీరి నుంచి రూ.7.20 లక్షల విలువైన చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిపై గతంలో కూడా చైనా మాంజా విక్రయం కేసులున్నాయని పోలీసులు తెలిపారు.

గోదాంలో బాణాసంచా నిల్వ

● నిందితుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ,(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గోదాంలో బాణాసంచా నిల్వ చేసిన వ్యక్తిని సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, అఫ్జల్‌గంజ్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. బేగం బజార్‌కు చెందిన మహిపాల్ సింగ్ (23) డీఆర్ కాంప్లెక్స్‌లో గోదాం నిర్వహిస్తున్నాడు. ఇతడి దందాపై సమాచారమందుకున్న సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, అఫ్జల్‌గంజ్ పోలీసులు గోదాంపై దాడి చేసి, మహీపాల్ సింగ్‌ను అదుపులోకి తీసుకొని, రూ.6లక్షల విలువైన బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారు.






















పేట్ల బురుజు ఆస్పత్రిలో సిబ్బంది కొరత!

● ఇబ్బంది పడుతున్న గర్భిణులు ● దృష్టి సారించని వైద్యాధికారులు


చార్మినార్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పేరుగాంచిన ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి పేట్ల బురుజులో సరిపడ సిబ్బంది లేక రోగులు ఇబ్బంది పడుతున్నా రు. నగరంతో పాటు వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి అత్యవసర ప్రసవాలకు ఇక్కడికి వస్తుంటారు. ప్రసవం సమయంలో ప్రాణం మీదికొచ్చి వదిలేసిన వారిని కూడా ఇక్కడ సురక్షితంగా ప్రసవం చేసి తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడిన ఘటనలు చాలానే ఉన్నాయి. అంతటి పేరు గాంచిన ఆస్పత్రిలో వివిధ డిపార్టమెంట్లలో సరైన సిబ్బంది లేక రోగులకు ఇబ్బందులు తలెత్తుతున్నా యని గర్భిణిలు, వారి సహాయకులు వాపోతున్నారు. ఆస్పత్రిలో ఉండాల్సిన హెల్త్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫార్మసిస్టులు అవసరం ఉండగా నగం మందితో సరిపెడుతున్నారు. ల్యాబ్ టెక్నీషన్ కొరత, ఎంపీ హెచ్‌ఎస్(ఫిమేల్), పీహెచ్‌ఎన్ పోస్టు సైతం ఖాళీలు ఉన్నా యి. ఆస్పత్రిలో డైటీషన్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఆయా విభాగాలకు వెళ్లే రోగులకు ఖాళీ కుర్చీలే దర్శమిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఆస్పత్రిలోని ఖాళీలను భర్తీ చేయాలని రోగులు, సహాయకులు కోరుతున్నారు.











నృత్యం చేస్తున్న కళాకారులు

మనోహరంగా దేవీ దర్శనం నృత్య రూపకం

రవీంద్రభారతి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్యాంశాలతో దేవీ దర్శనం కలిగించిన నర్తకులు ప్రేక్షకుల్ని భక్తిభావం పెంపొందించారు. ఆవాహన, జనాని, సంగీతం, నాటక కథ, భజన, శబ్దం అంశాల సమ్మేళనంతో మనోహరంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు రవీంద్రభారతి వేదికగా జరిగిన సంగీత, నృత్యోత్సవం బుధవారం ముగిశాయి. ముగింపు ఉత్సవంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నాట్య గురువు డాక్టర్ అరుణా భిక్షు శిష్య బృందం దేవీ దర్శనం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. శివుడు పంచభూతాల స్వరూపం అని చాటుతూ సాగిన భో శంభో కీర్తనకు నర్తించి అలరించారు. దివంగత భిక్షు రాసిన శ్లోకంతో ప్రారంభమై విశేషంగా ఆసక్తికరంగా సాగింది. అంతకు ముందు సూర్యప్రకాష్, వడ్డి వరలక్ష్మి, శివశంకరరావు స్మారక సేవా సమతి కళాకారులు వీనులవిందుగా అమ్మవారిని స్తుతిస్తూ జానపద భక్తి సంగీతం సమర్పించి కరతాళ ధ్వనులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ ఛైర్ పర్సన్ ఆచార్య డాక్టర్ అలేఖ్య పుంజాల, నాట్య గురువు కళాకృష్ణ, సాంస్కృతి శాఖ మాజీ డైరెక్టర్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొని నృత్య కళాకారులను, గాయకులను సత్కరించి అభినందించారు.



మహిషాసురుడిని అంతమొందించే సన్నివేశం







వెంకటేశ్వర కాలనీని సందర్శించిన కార్తీక్‌రెడ్డి

నార్సింగ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ రాజేందర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి బుధవారం మణికొండ పురపాలక సంఘం పరిధిలోని వేంకటేశ్వర కాలనీని సందర్శించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం సమావేశంలో జరిగిన తోపులాటలో సంబంధం లేని వారిని ఎఫ్ఐఆర్‌లో చేర్చి ఇబ్బందులకు గురి అయిన కుటుంబాలను కార్తీక్‌రెడ్డి పరామర్శించారు.



మాట్లాడుతున్న పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి



● అక్టోబర్ 2 నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగనున్న 53వ రామాయణ్ మేళాలో ముఖ్యఅతిథిగా హాజరు కావాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న రామాయణ్ మేళా కన్వీనర్ గోవింద్ రాఠీ, గిరిధర్‌లాల్

– అఫ్జల్‌గంజ్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)



● 3వ బాబయ్య రెజ్లింగ్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ టైటిల్ విజేతకు హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ వెండి, గదను బహూకరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ రెజ్లింగ్ అసోసియేషన్ ఛైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, జ్ఞానేశ్వర్, యోగేశ్వర్‌దత్తు, పహిల్వాన్లు సంతోష్, ఆనంద్, అభిమన్యు, గులాబ్‌సింగ్ పాల్గొన్నారు.

– మంగళ్‌హాట్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో దుర్వాసన

పహాడిషరీఫ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో దసరా పండుగ జరుపుకొనే ప్రాంతం. పాఠశాల పరిసర ప్రాంతాలు దుర్వాసనతో నిండి కుళ్ళిపోయిన పదార్థాలతో ఉండడంతో భక్తులు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల పండుగల సందర్భంగా కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వెంటనే సంబంధిత అధికారులు పరిసరాలను శుభ్రం చేసి భక్తుల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరికుప్పల కిరణ్, రాజ్‌పవన్ పటేల్, నవారు రోహిత్ రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



అపరిశుభ్రంగా ఉన్న మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం





● ఆయుధ పూజ



విజయదశమి సందర్భంగా కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రిలో బుధవారం యాజమాన్యం, వైద్య సిబ్బంది ఆయుధ పూజ, దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ జి.రాంరెడ్డి, డాక్టర్ పి.జి.రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ అనిల్, డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ శరత్‌చంద్ర, డైరెక్టర్లు, వైద్యులు పాల్గొన్నారు.
- బర్కత్‌పుర, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)



మహిషాసుర మర్దని దేవి అలంకరణలో ఉప్పుగూడ మహంకాళి అమ్మవారు
- చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)



గోషామహల్ నియోజకవర్గం ఉస్మాన్‌గంజ్ యూత్ కాంగ్రెస్ నాయకుడు శివ ఆధ్వర్యంలో జరిగిన పూజలో పాల్గొన్న తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్
- గోషామహల్, (ఆంధ్రజ్యోతి)



బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ సభ్యుడు పెరిక సురేశ్ గృహంలో జరిగిన పూజలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్
- అఫ్జల్‌గంజ్, (ఆంధ్రజ్యోతి)



శివరాంపల్లిలో అమ్మవారిని దర్శించుకున్న రాజేంద్రనగర్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్



మహిషాసుర మర్దని రూపంలో దర్శనం ఇస్తున్న జమ్మిచెట్టు దుర్గామాత



చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద అమ్మవారి పల్లకిసేవ ఊరేగింపు దృశ్యం

● అన్నదానం



దసరా నవరాత్రుల సందర్భంగా మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ కార్యదర్శి ఏలిమేటి అమరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోరెడ్డి వెంకట్ రెడ్డి, వరికుప్పల వెంకటేష్, వంగేటి మధుసూదన్ రెడ్డి, తదితరులు
- పహాడిషరీఫ్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)

కనుల పండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు



విజయదశమి సందర్భంగా పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న టీపీసీసీ కార్య నిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్

ఎక్సైజ్ కార్యాలయంలో...

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలోని శ్రీలలితా త్రిపుర సుందరి ఆలయంలో తొమ్మిది రోజులపాటు శరత్ నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చివరి రోజు ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం పూర్ణాహుతి నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి, శంషాబాద్ ఎక్సైజ్ ఈఎస్ కృష్ణప్రియ, సరూర్ నగర్ ఈఎస్. ఉజ్వలరెడ్డి, అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, జాయింట్ కమిషనర్ రాథోడ్ సురేష్, రంగారెడ్డి డీసీ దశరథ్ పాల్గొన్నారు.

మహిషాసుర మర్దినిదేవీగా దర్శనం

రాజేంద్రనగర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో దేవీ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఆలయాలు, బస్తీల్లో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. రాజేంద్రనగర్ హరిహర క్షేత్రంలో బుధవారం అమ్మవారు మహిషాసుర మర్దినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి అనంతాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక లలితా సహస్రపారాయణం నిర్వహించారు. గురువారం రాజరాజేశ్వరీ దేవీ అలంకరణ, దసరా వేడుకలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



హరిహర క్షేత్రంలో మహిషాసుర మర్దినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

భాగ్యలక్ష్మి అమ్మవారి పల్లకీ సేవ

చార్మినార్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్న నవరాత్రుల్లో భాగంగా బుధవారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పల్లకీ సేవ భాగ్యలక్ష్మి ఆలయం నుంచి ప్రారంభమై చౌక్ మైదాన్, పంజెష, గుల్జార్ హౌస్, ఘన్సీ బజార్, హైకోర్టు, మదీనా, గుండా భాగ్యలక్ష్మి ఆలయానికి చేరుకొంది. వివిధ దేవతా మూర్తుల వేశధారణ ఎంతో ఆకట్టుకుంది. భాగ్యలక్ష్మి ఆలయం నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. చార్మినార్ పోలీసులు భారీ బందోబస్త్ ఏర్పాట్లు చేశారు.

'బాస్' ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) నూతన కార్యవర్గం ఇటీవల నియమితులైన సందర్భంగా మంగళవారం వర్గల్ శ్రీవిద్యా సరస్వతి ఆలయంలో సరస్వతి దేవి అమ్మవారికి దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానపూజారి చంద్రశేఖర్ శర్మ సిద్ధాంతిని సన్మానించారు. కార్యక్రమంలో బాస్ అధ్యక్షుడు మేడిశెట్టి రాకేశ్, ప్రధాన కార్యదర్శి భద్రేశ్వర్, సీఏ అనిల్ నాయర్, బాస్ సంస్థ ప్రతినిధులు జగదీష్, నర్సింగ్‌రావు, శ్రీహరి, కె.సంతోష్, ఎ.అశోక్, రోహిత్, దుర్గాప్రసాద్, నరేశ్‌కుమార్, వై.సంతోష్ పాల్గొన్నారు.



చంద్రశేఖర్ శర్మ సిద్ధాంతిని సన్మానిస్తున్న బాస్ సంస్థ ప్రతినిదులు

పత్తికుంట కొలన్‌ను శుభ్రం చేయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి : బీజేపీ

రాజేంద్రనగర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్ పత్తికుంట వద్ద ఉన్న కొలన్‌ను శుభ్రం చేయకపోవడంతో బతుకమ్మలు వేయడానికి మహిళలు తీవ్ర ఇబ్బంది పడ్డారని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ పి.మల్లేశ్ యాదవ్, ఆపార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ అన్నారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా పత్తికుంట కొలన్‌ను శుభ్రం చేసే పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ సరిగ్గా పనులు చేయకపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని గుర్తు చేశారు. ఇదే విషయమై రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం ఈఈ నరేందర్ గౌడ్‌ను కలిసి విన్నవించామని, డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా కొలన్‌ను శుభ్రం చేసే కాంట్రాక్టు పొందిన వ్యక్తి వినాయక విగ్రహాలను తీయకుండానే పనులు వదిలివేశాడని, దాంతో కొలనులో మట్టి, సీకులు అలానే ఉన్నాయన్నారు. వాటిని పూర్తిగా తీసివేసి బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి మంచినీటితో నింపాలని అధికారులను కోరినా, వారు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పత్తికుంట కొలనువద్ద కాంట్రాక్టు పొంది పనిచేయని వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని దక్షిణ మండలం జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఈఈలను కోరారు. అధికారులను కలిసిన వారిలో బీజేపీ నాయకులు కోరని సదానంద్, బండారి బాలక్రిష్ణ, పి.రవీందర్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



నరేందర్ గౌడ్‌కు సమస్యను వివరిస్తున్న బీజేపీ నాయకులు శ్రీధర్, మల్లేశ్ యాదవ్

అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య

రాజేంద్రనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ బస్తీలో బుధవారం యువతి తన గదిలో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కారణాలు తెలియరాలేదు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదర్‌గూడకు చెందిన బండారు రమేశ్ కూతురు బండారి యశిక(29) విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించారు. ప్రస్తుతం నగరంలో సాఫ్ట్‌వేర్‌గా మంచి ప్యాకేజీలో ఉద్యోగం చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం హైదర్‌గూడలోని తమ నివాసంలో తన గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చ్యురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



బండారు యశిక

సంపులో పడి మహిళ మృతి

రాజేంద్రనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నీటి సంపులో పడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం సాయంత్రం లక్ష్మీగూడ వాంబే కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీగూడ వాంబే కాలనీకి చెందిన రాములు భార్య అనిత(48) ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందింది. మైలార్‌దేవుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనిత మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన అనిత

దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ పేరుతో ఆర్డర్ ఇచ్చి..

● వ్యాపారవేత్త నుంచి రూ.2.26 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారినంటూ వ్యాపారవేత్తను సంప్రదించిన సైబర్ నేరగాడు ఆర్డర్ పేరు చెప్పి రూ.2.26 లక్షలు కాజేశాడు. నగరానికి చెందిన కంపోస్టబుల్ మ్యాచ్ షీట్స్ (నేలలో తేమ నిలుపుతూ, గడ్డి పెరగకుండా నిరోధించే) తయారీ సంస్థ ఎండీని సైబర్ నేరగాడు సెప్టెంబరు 18న ఫోన్‌లో సంప్రదించాడు. తనపేరు కునాల్ అని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో అధికారినని పరిచయం చేసుకున్నాడు. తమకు ఒక టన్ను కంపోస్టబుల్ మ్యాచ్ షీట్స్ సరఫరా చేయాలని కోరాడు. దానికి సంబంధించి నకిలీ జీఎస్టీ, ఇతర పత్రాలను వాట్సప్ ద్వారా పంపాడు. తర్వాత ఆర్డర్ డెలివరీ చేయకముందు వెండర్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పంపాలని కోరాడు. తర్వాత వివిధ పన్నులు, రీఫండ్ పేరుతో రూ.2.26 లక్షలు వేర్వేరు ఖాతాలకు బదిలీ చేయించుకున్నాడు. ఇంకా డబ్బు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడిన సామాజిక కార్యవర్గ ఆర్.సంతోషి, ఆర్.వైష్ణవి
- హిమాయత్‌నగర్, ఆంధ్రజ్యోతి



శివరాంపల్లిలో బతుకమ్మ ఆడుతున్న కార్పొరేటర్ అర్చన



సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని గోషామహల్ డివిజన్‌లో చాక్నావాడి బస్తీలో బీఆర్‌ఎస్ నాయకులు సురేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ఆడిపాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దత్తు తదితరులు పాల్గొన్నారు.
- గోషామహల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి)



హైదర్‌గూడ వద్ద బతుకమ్మలతో మహిళలు



పెద్ద తాళ్లకుంట వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రాజేంద్రనగర్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో రంగురంగు పూలతో అలంకరించిన సద్దుల బతుకమ్మలను మహిళలు పెద్ద తాళ్లకుంటలో వదిలారు. అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య మహిళలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.



సద్దుల బతుకమ్మ సందర్భంగా హైదర్‌గూడలో బతుకమ్మతో మహిళ

వాడవాడలా సద్దుల బతుకమ్మ సంబురం

పహాడిషరీఫ్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజుల ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగిశాయి. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన బతుకమ్మ ఉత్సవాలు సోమవారం రాత్రి, మంగళవారం సద్దుల బతుకమ్మతో ముగిశాయి. మామిడిపల్లి, పహాడిషరీఫ్, జల్‌పల్లిలో మహిళలు బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మహిళలు ఒక చోట చేర్చి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. 'చిత్తూ చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ' 'ఏక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయే చందమామ' అంటూ బతుకమ్మల చుట్టూ మహిళలు ఆడుతూ పాడిన పాటలు శివారు గ్రామాల్లో మారుమోగాయి. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో జల్‌పల్లి బడంగ్‌పేట్ నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యమైన చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు బతుకమ్మ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రధాన కూడళ్లలో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొని మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. చెరువులు కుంటలు, పలుచోట్ల ఏర్పాటు చేసిన నీటి తొట్టెలో బతుకమ్మలను వదిలి ప్రసాదాలు పంపిణీ చేసుకున్నారు.



మామిడిపల్లిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

మామిడిపల్లిలో మహిళలకు బహుమతులు

మామిడిపల్లిలో బతుకమ్మలతో వచ్చిన మహిళకు బహుమతులు అందజేశారు. అందంగా అలంకరించిన బతుకమ్మలను ఎంపిక చేసి మొదటి బహుమతి రూ.3వేలు, 2వ బహుమతి రూ.2వేలు, మూడో బహుమతి రూ.1000, ఇద్దరు చిన్నారులకు సైతం బహుమతులను నిర్వాహకులు, లాల్ సతీష్ గౌడ్, కళ్లెం నరేష్‌గౌడ్, జి గణేష్ గౌడ్ అందజేశారు.



మామిడిపల్లిలో హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పహాడిషరీఫ్ హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వర్షం పడితే వరదే!

● పాతబస్తీలోని లోతట్టు ప్రాంతాలకు భారీగా వరద నీరు
● తీవ్ర ఇబ్బందుల్లో స్థానికులు

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వర్షం వచ్చిందంటే చాలు లోతట్టు ప్రాంతాల ప్రజ లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. రాజన్నబావి, శివగంగానగర్, ఛత్రినాక చౌరస్తా, హనుమాన్‌నగర్, అయోధ్యానగర్లలో వరద నీటి సమస్య పరిష్కారానికి రాజన్న బావి నుంచి చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనులు సగం వరకే చేపట్టారు. దీంతో దిగువ బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 35 సంవత్సరాల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా నాలుగు ఫీట్ల వెడల్పు, నాలుగు ఫీట్ల పొడవుతో రాతి కట్టడంతో నిర్మించిన ఈ నాలా ప్రస్తుతం ఏ మాత్రం సరిపోవడం లేదు. వర్షాలు కురిసిన సమయంలో వర్షం నీరు మాత్రమే వెళ్లేలా నిర్మితమైన ఈ నాలాలోకి కాలక్రమేణ పూర్తిగా డ్రైనేజీ లైన్లను కలిపేశారు. దీంతో నాలా పూడుకుపోయి వర్షపు నీరు పూర్తిగా రోడ్లపై పారుతోంది. వట్టెపల్లి, ఫలక్‌నుమా, గాంధీనగర్, రాజన్నబావి ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు మొరంబావి, శివగంగానగర్ మీదుగా ఛత్రినాక వరకు పెద్దఎత్తున పారుతోంది. ఈ వరద ధాటిలో వాహనాలు సైతం కొట్టుకుపోతున్నాయంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. స్థానికులు పలుమార్లు అధికారులను కలిసి విన్నవించడంతో రాజన్నబావి నుంచి మొరంబావి వరకు నాలా విస్తరించి బాక్స్ డ్రెయిన్‌ను నిర్మించారు. ఈ పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా, మొరంబావి నుంచి ఛత్రినాక వరకు పనులను ప్రారంభించలేదు.



ఛత్రినాక ప్రధాన చౌరస్తాలో కొట్టుకుపోయిన బీటీ రోడ్డు



శివగంగానగర్‌లో పారుతున్న వరద నీరు (ఫైల్)

నాలాను విస్తరించాలి



ఛత్రినాక నుంచి లలితాబాగ్ వరకు నాలాను విస్తరించాలి. నాలుగు ఫీట్ల నాలా మాత్రమే ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. లలితాబాగ్ వద్ద నీరు వెళ్లడానికి ఔట్‌లెట్ సరిగ్గా లేదు. దాని సరిచేయాలి. నాలా పూడికతీత పనులు చేపట్టాలి.
- శివ చంద్రగిరి, హనుమాన్‌నగర్

వర్షం పడినప్పుడు గ్రేటర్ కమిషనర్ ఛత్రినాకలో పర్యటించాలి



చిన్నపాటి వర్షానికే చాంద్రాయణగుట్ట నియోజకవర్గం శివగంగానగర్ చెరువుగా మారుతోంది. నాలాను విస్తరించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై గ్రేటర్ కమిషనర్, జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశాం. వర్షం పడినప్పుడు గ్రేటర్ కమిషనర్ పాత బస్తీలో పర్యటిస్తే సమస్య అర్థమవుతుంది.
- పొన్న వెంకటరమణ, బీజేపీ నాయకుడు

క్షేత్రస్థాయిలో పారిశుధ్య పర్యవేక్షణను బలోపేతం చేయాలి

● జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు ప్రభావవంతంగా జరిగేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పారిశుధ్య కార్యక్రమాల అమలుపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఏసీ శానిటేషన్ రఘు ప్రసాద్‌తో సమీక్ష నిర్వహించారు.

ప్రైమరీ కలెక్షన్‌లో ఉన్న లోటుపాట్లు, జీవీపీ క్లియరెన్స్, అదనపు బిన్ల ఏర్పాటు, చెత్త సేకరణలో ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో శానిటేషన్ కార్యక్రమాలు ప్రభావవంతంగా చేపట్టేందుకు అధికారులు పర్యవేక్షణ పెంచాలన్నారు. చెత్త సేకరణ వాహనాలపై పర్యవేక్షణ ఉండాలని, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చేసిన పనులను పరిశీలించి, ప్రతిపాదిత నిర్మాణాత్మక పరిష్కారాలను కమిషనర్ సమీక్షించారు. నగరంలో స్వచ్ఛత కార్యక్రమాలు మరింత మెరుగుపడాలని, జవాబుదారీతనం, సమయానుకూల చర్యలు, పర్యవేక్షణ పెంచాలని అధికారులను ఆదేశించారు.